క్లుప్తంగా

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోదాడ రూరల్ సీఐ రజిత అన్నారు. మంగళవారం చింతలపాలెం మండలంలోని కొత్తగూడెం తండాలో నిర్వహించిన సామాజిక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల విధులకు విఘాతం కలిగించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తా


అభయాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌ను సన్మానిస్తున్న పూజారి, నాయకులు

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి ఆలయ నూతన చైర్మన్‌గా ఎన్నికైన కొడారు వెంకటేశ్వర్లును మంగళవారం పలువురు నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. కాగా, ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రజినీకాంత్‌ఆచార్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ


ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సిందూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, ఆలంకరణ, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముదుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి అమ్మ ఆదర్శ కమిటీలు

నడిగూడెం : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రామలక్ష్మి, పీఆర్ ఏఈ రంగారావు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, ప్రత్యేక అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వడదెబ్బపై వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : ఎండలు మండిపోతున్నందున ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి రూపేందర్‌సింగ్, ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. మంగళవారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవ్య, సుశీల, సీహెచ్ఓ వినోద్, ఏఎన్ఎమ్‌లు, ఎమ్ఎల్‌హెచ్‌పీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేటలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ జాను గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం జాను మృతదేహాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణానాయక్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా కొత్తగూడెంలో మృతి చెందిన నకిరేకంటి కోటయ్య కుటుంబానికి కీతవారిగూడెం మాజీ సర్పంచ్ కీత జ్యోతిరామారావు రూ.8వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వీరంరెడ్డి శంభిరెడ్డి, ఇసాక్, స్రవంతిశోభన్‌బాబు, నకిరేకంటి ప్రసాద్, మామిడి వెంకటేశ్వర్లు, పిడమర్తి అంజి, శంకర్‌నాయక్, మధర్, గుర్వయ్య పాల్గొన్నారు.

తీరనున్న వంతెన కష్టాలు

- సాగర్ ఎడమ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.93 కోట్లు మంజూరు
- టెండర్లు పూర్తి చేసిన అధికారులు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


మఠ్రికుంట వద్ద సాగర్ కాలువపై శిథిలావస్థకు చేరిన వంతెన

గరిడేపల్లి : మండలంలోని మఠ్రికుంట వద్ద సాగర్ ఎడమ కాలువపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు మోక్షం లభించింది. పురాతనమైన ఈ వంతెనను తొలగించి నూతన వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీంతో ప్రయాణికులు, ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి. కోదాడ- మిర్యాలగూడ హైవే నుంచి సూర్యాపేట రోడ్డు మార్గంలో మఠ్రికుంట వద్ద సాగర్ ఎడమ కాల్వపై ఈ వంతెన ఉంది. కాగా, వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి 93 లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్ సిద్ధంగా ఉన్నాడు. వంతెన నిర్మాణం జరగబోతుండడంతో నిత్యం సూర్యాపేటకు ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో వంతెన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుతున్నారు.

మూలమలుపుల సమస్య పరిష్కారానికి..

కాగా, మఠ్రికుంట గ్రామానికి ముందు, మఠ్రికుంట గ్రామం దాటిన తర్వాత సూర్యాపేట రోడ్డుపై ఆరు చోట్ల మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సాగర్ కాలువపై వంతెన నిర్మాణానికి ముందే మూలమలుపుల సమస్యను పరిష్కరించాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు ప్రయత్నం చేస్తున్నారు. అయితే మూలమలుపుల సమస్య పరిష్కారానికి రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలంటే మఠ్రికుంటలో కొన్ని నివాస గృహాలు తొలగించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అలైన్‌మెంట్ మార్చి పనులు ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు రోడ్డు నిర్మాణానికి గ్రామస్తులను ఒప్పించి పనులు చేయించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారుల సమన్వయంతో గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా అందరి ఆమోదంతో వంతెన, రోడ్డు పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభం



త్వరలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల సమస్య పరిష్కారం కానుంది. గరిడేపల్లి, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, మఠంపల్లితో పాటు పలు మండలాల ప్రజలు, ప్రయాణికులకు ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది.
– పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ

తూముల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు


సమావేశంలో పాల్గొన్న అధికారులు

నడిగూడెం : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని మేజర్ కాల్వల ద్వారా వృథాగా పోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ హేమామాలిని తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు ప్రభుత్వం సాగర్ నుంచి నీటిని విడుదల చేసిందన్నారు. కావున మండల పరిధిలోని రామాపురం, చాకిరాల, సిరిపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల వద్ద ఉన్న మేజరు కాల్వల తూముల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నిఘా ప్రాంతంలో సంబంధిత ప్రభుత్వ సిబ్బంది విడతల వారీగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, ఎస్ఐ జి.అజయ్ కుమార్, ఆర్ఐ గోపాలకృష్ణ, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలి


తిమ్మారెడ్డిగూడెంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ములకలపల్లి రాములు

మునగాల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీలనుద్దేశించి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. చేసిన పనికి వారం రోజుల్లో డబ్బులు చెల్లించాలని కోరారు. ఎండ తీవ్రంగా ఉన్నందున కూలీలకు పని ప్రదేశంలో టెంట్ సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ చట్టం అమలులో అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ఉపాధి హామీ చట్ట రక్షణకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరం పెండింగ్‌లో ఉన్న వేతనాలను జిల్లా స్థాయి అధికారులు జోక్యం చేసుకొని యుద్ధప్రాతిపదికన చెల్లించాలని రాములు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం మేట్లు వెంకన్న, తిమ్మారెడ్డి సైదిరెడ్డి, నరేందర్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

న్యాయవాదులు పదవికి వన్నె తేవాలి


బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న అధ్యక్షుడు రామిరెడ్డి

హుజూర్‌నగర్ : బార్ అసోసియేషన్‌కు ఎన్నికైన న్యాయవాదులు ఆ పదవికి వన్నె తేవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కోరారు. హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, కోశాధికారి బానోతు సురేష్ కుమార్‌ల చేత మంగళవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హుజూర్ నగర్‌లో న్యాయస్థానాల పెంపు, న్యాయస్థానాలలో తగిన మౌలిక వసతుల కల్పన, సిబ్బందిని సమకూర్చటం, న్యాయవాదుల సంక్షేమానికి తమ కార్యవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. న్యాయవాదులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తాను ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి పక్షాన నిలబడతానని చెప్పారు. అనంతరం వారిని పలువురు న్యాయవాదులు, స్థానికులు శాలువాలు, గజమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నట్టి సత్యనారాయణ, అంబటి శ్రీనివాసరెడ్డి, చనగాని యాదగిరి, నాగేష్ రాథోడ్, రవికుమార్, రామ లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


మఠంపల్లిలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రన్‌మియా

మఠంపల్లి : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌టీచర్ల, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. మంగళవారం మఠంపల్లిలో నిర్వహించిన సీఐటీయూ అనుబంధం అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మఠంపల్లి మండలానికి సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగ్రుడ్లు గురించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు మఠంపల్లి అంగన్‌వాడీ టీచర్లకు ఎలాంటి సంబంధం లేదని, దీనిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచి, సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు నీలాబాయి, సంతోషికుమారి, గౌరవాధ్యక్షురాలు లింగమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులపై సిబ్బందికి అవగాహన

తుంగతుర్తి : పోలింగ్ విధుల నిర్వహణపై పీఓలు, ఏపీఓలు నిర్లక్ష్యం వహించకుండా ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఎన్నికల నిర్వహణపై మంగళవారం మండల కేంద్రంలోని ఆర్వీఆర్వీ గురుకుల పాఠశాలలో పీఓలకు, ఏపీఓలకు నిర్వహించిన రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా ఈవీఎంల పనితీరు, ఎన్నికల నియమావళిపై సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మాక్‌పోల్ నిర్వహణ, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల ఉపయోగంతోపాటు, ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రమణారెడ్డి, అమీన్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్లు, పీఓలు, ఏపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


పాలకవీడులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

పాలకవీడు : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని స్థానిక ఎస్ఐ లక్ష్మీనర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ప్రజలతో మమేకం అయ్యేందుకు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల విగ్రహాలకు జలాభిషేకం


విగ్రహాలకు జలాభిషేకం చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి, కీర్తి ధ్వజ, గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం విగ్రహాలకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జలాభిషేకం చేశారు. సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, లక్ష్మోద్ధారణ, నవకలశ స్నాపనం, జలాధివాసం, మూలమంత్ర హోమం, చండీహోమం, శ్రీరుద్ర, నవగ్రహ, వాస్తు హోమములు, వేద పారాయణ నిరాజనం, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలను సుబ్రహ్మణ్యేశ్వర శర్మ నేతృత్వంలో రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాళ్లబండి రాజశేఖర్‌శర్మ బృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తకాల దినోత్సవం


విద్యార్థులకు ప్యాడ్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరులో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోనే అన్ని విషయాలపై అవగాహన పొందుతారని, చదువుతో ప్రపంచంలో సాధించలేనిది ఏమిలేదన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటనర్సయ్య, క్లబ్ ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి, ఉపాధ్యాయులు రామారావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన వంగవీటి వరప్రసాద్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన జ్ఞాపకార్థం మిత్రబృందం, కుటుంబ సభ్యులు మంగళవారం స్థానిక ఇందిరా గాంధీ చౌరస్తాలో బాటసారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సుధాకర్, వి.రూపేష్‌కుమార్, పి.గోపిరెడ్డి, బి.శ్రీనివాస్, వి.రమేష్, కె.కోటేశ్వరరావు, వి.రామ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- డీపీఓ సురేష్‌కుమార్


మాట్లాడుతున్న డీపీఓ సురేష్‌కుమార్

మఠంపల్లి : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని, పంచాయతీ కార్యదర్శులు ఉదయం ఏడు గంటలకే గ్రామాలకు చేరుకోవాలని డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సమీక్ష సమావేశంలో కోదాడ డీఎల్‌పీఓ యాదగిరితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా పైపులైన్ల లీకేజీలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లలో వెనుకబడిన మండలాలు, గ్రామాల వారు ప్రత్యేక ప్రణాళికతో నూరుశాతం ఇంటిపన్ను వసూళ్లను పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోల పారిశుద్ధ్యంపై ప్రత్యే చొరవ చూపాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. అనంతరం పొదుపు సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు గ్రామాల్లో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఎంపీడీవో జానకిరాములు, ఎంపీవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు, ఎం.వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, నాగేశ్వరరావు, చంటి, ఉమ. తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష

మునగాల : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదమున్నందున నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాన్ని గుర్తించి నీటి సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. పనిచేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ కాలువకు నీటిని విడుదల చేసినందున పాలేరు చెరువు నిండిన తర్వాత ఎడమ కాలువ పరిధిలోని చెరువులు, కుంటలు నింపేందుకు కృషి చేయాలన్నారు. సాగర్ నీటిని వృథా చేయవద్దన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, ఎన్ఎస్పీ ఏఈ సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఏఈ వికాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగులు, ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి


మేళ్లచెరువు : పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేఎల్ఎన్ ప్రసాద్, తదితరులు


హుజూర్‌నగర్‌రూరల్ : పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాగన్నగౌడ్ తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు బహుజనులంతా ఐక్యం కావాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని బూరుగడ్డలో గౌడ్ సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులతో కలిసి పాపన్నగౌడ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేకపోతుల వెంకయ్య, కాసాని గురవయ్య, మట్టపల్లి నర్సింహారావు, గురవయ్య, వెంకన్న, సైదులు, వీరబాబు, నాగరాజు, మట్టయ్య, గురుస్వామి, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లైసెన్స్‌లు ఇప్పిస్తా

మేళ్లచెరువు : అర్హులైన గీత కార్మికులందరికీ లైసెన్స్‌లు ఇప్పిస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్లటూరులో సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సహకారంతో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జనగామ జిల్లాను త్వరలో సర్దార్ పాపన్న గౌడ్ జిల్లాగా పేరు మార్చబోతున్నట్లు, దానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు.

సాగర్ నీటితో చెరువులు నింపాలి


మునగాల : కొక్కిరేణిలో మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు

మునగాల : ప్రభుత్వం తాగు నీటి కోసం సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసినందున ఆయకట్టు పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులు, కుంటలను నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణిలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల మూలంగా పలు గ్రామాలలో చెరువులు, కుంటలు అడుగంటిపోవడంతో భూగర్భజల వనరులు పూర్తిగా తగ్గిపోయి తాగునీటికి కటకట ఏర్పడిందన్నారు. తాగునీటి అవసరాలకు చెరువులు, కుంటలు నింపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఎం గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు, నాయకులు పోటు పుల్లయ్య, రావులపెంట బ్రహ్మం, ములకలపల్లి సైదులు, నాగరాజు, ప్రసాద్, ముంత రాములు, మామిడి లింగయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువును సాగర్ నీటితో నింపాలని వినతి


మునగాల : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సామాజిక కార్యకర్త సైదులు తదితరులు

మునగాల : తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి మునగాల మేజర్ గ్రామపంచాయతీలో తాగునీటికి కటకట ఏర్పడిందని, సాగర్ ఎడమ కాలువకు తాగునీటి విడుదల చేసినందున ఎత్తిపోతల పథకం ద్వారా మునగాల ఊరచెరువును సాగర్ నీటితో నింపాలని మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త సైదులు, యుగంధర్‌రెడ్డి, వీరభద్రరావులు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్‌నీటితో చెరువును నింపితే భూగర్భ జలాలు పెరిగి తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. అదేవిధంగా కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, ఋత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను నిర్వహించారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలని వినతి

సూర్యాపేట : పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం, క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. అన్నదాతకు అండగా బీఆర్ఎస్ ఉద్యమ బాట పేరుతో మంగళవారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపి కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నీరు, విద్యుత్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, ఎంపీపీలు నెమ్మాది భిక్షం, మర్ల చంద్రారెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్, సింగిల్ విండో చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, బాల సైదులుగౌడ్, నరసింహారావు, ప్రసాద్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.